క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్


జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎస్‌సీ.రాఘవేంద్ర తెలిపారు. అన్ని రకాల సివిల్, వివాహ సంబంధ మనోవర్తి, చెక్కు బౌన్స్, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం మూడు బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. రాజీ మార్గమే రాజమార్గమని, కక్షిదారులు సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు ట్యాబ్‌లు


దివ్యాంగులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీప

నింద్ర: స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా ఎంపీపీ దీప పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులను తక్కువగా చూడవద్దన్నారు. వారికి విద్యను అందించడం ద్వారా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. అనంతరం వారికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, ఎంఈవో శ్రీధర్‌రాజు, ఐఈఆర్టీ వెంకటేష్, వాసు, వైద్యాధికారి కిషోర్ కూమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి మోటార్‌కు మరమ్మతులు


మోటార్‌కు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ మురళీయాదవ్

పుత్తూరు: మండలంలోని శిరుగురాజుపాళెంలో మరమ్మతులకు గురైన తాగునీటి మోటార్‌కు సర్పంచ్ మురళీయాదవ్ రిపేరు చేయించారు. అనంతరం గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేశారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సక్రమంగా రికార్డుల నమోదు


మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్‌మస్తాన్

పాలసముద్రం: మండలంలోని వీవోఏలు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్య పోషణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం పాడిపశువుల పెంపకానికి రూ.50 వేలు వడ్డీ లేని రుణం ఇస్తోందన్నారు. ఇంతవరకు ఉన్నతి, స్త్రీనిధి తీసుకోని సభ్యులు పాడిపశువులు రుణాలను కోసం సంఘమిత్రల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీవో లీడర్లు పాల్గొన్నారు.

చెరుకు ట్రాక్టర్ బోల్తా



వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట సమీపంలోని తిరుపతి–చిత్తూరు ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం చెరుకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. చెరుకును లోడు చేసు కున్న ట్రాక్టర్ ఆళ్లమడుగు వైపు నుంచి సాగర్ షుగర్ ఫ్యాక్టరీకి వెళుతోంది. దేవళంపేట సమీపంలో ఉన్న మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. సామర్థ్యానికి మించి చెరుకును లోడు చేయడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. వాహనాలు వెళ్లేందుకు వీలుకాకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. గంటకు పైగా వాహనాలు బారులుతీరాయి.

వైభవంగా ఏకాదశి ఉత్సవం

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

బాగుపడిన రోడ్లు

- మంత్రి రోజా చొరవతో యుద్ధ ప్రాతిపదికన పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు



నగరి: బీరకుప్పం వద్ద పునరుద్ధరించిన రోడ్డు, గోపాలకృష్ణాపురం వద్ద బాగుచేసిన రోడ్డు

పుత్తూరు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నగరి నియోజకవర్గంలో రోడ్లు, కాలువలు దెబ్బతిన్నాయి. వాటిని యుద్ధ ప్రాతిపదికన బాగుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అధికారులను ఆదేశించారు. దీంతో గడిచిన 48 గంటల్లోనే దాదాపు అన్ని చోట్లా రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
భారీ వర్షానికి ఈ నెల 5న పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురం వద్ద కల్వర్టుకు ఆనుకుని సుమారు పది అడుగుల లోతుకు రోడ్డు కోతకు గురైంది. దీంతో గోపాలకృష్ణాపురం నుంచి ప్రభుత్వ గురుకుల పాఠశాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ యుద్ధప్రాతిపదికన రోడ్డు పునఃరుద్ధరణ పనులు పూర్తి చేశారు. అలాగే వర్షపు నీటి ప్రవాహానికి పుత్తూరు మున్సిపాలిటీ 21వ వార్డు చెర్లోపల్లి రోడ్డు కొట్టుకుపోయింది. జేసీబీతో రోడ్డుకు మట్టిని తోలి బాగుచేశారు. అలాగే నగరి మండలం బీరకుప్పం ఆర్‌అండ్‌బీ లింకు రోడ్డు సైతం కోతకు గురైంది. ఇక్కడ అధికారులు వెంటనే రోడ్డు పునఃరుద్ధరణ పనులు పూర్తి చేశారు. పుత్తూరు పరిధిలోని శిరుగురాజుపాళెం, రాచపాళెం, ఎంబీ రోడ్డుల్లోని రైల్వే అండర్ బ్రిడ్జీల్లో నిలిచిన వర్షపు నీటిని మోటర్ల సాయంతో బయటికి పంపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


చెర్లోపల్లి రోడ్డు

ప్రత్యేక ప్రతిభావంతులకు డిజిటల్ బోధన


పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవో గిరిజ

పాలసముద్రం: భవిత కేంద్రంలోని ప్రత్యేక ప్రతిభావంతులకు డిజిటల్ విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంఈవో గిరిజ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల వద్దనున్న భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో గిరిజ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల విద్య విషయంలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. డిజిటల్ విద్యలో భాగంగా ట్యాబ్‌లు అందజేస్తోందని చెప్పారు. అనంతరం పిల్లలకు ట్యాబ్‌లు అందజేశారు. హెచ్‌ఎం మీనాక్షి, ఐఈఆర్టీ బాలాజీ, టీచర్లు వనజ, వెంకటేష్, కోదండయ్య పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న రాంప్రసాద్ రెడ్డి

నింద్ర: మండలంలోని అగరంపేట పంచాయతీ దళితవాడకు చెందిన తుపాను బాధితులకు శుక్రవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఆయన మట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని, ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీవో అరుణ, సర్పంచ్ చెల్లెమ్మ, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్ వేణురాజు, నాయకులు తోయదాక్షరం, నవీన్, వెంగమ్మ పాల్గొన్నారు.

‘అభివృద్ధిలో భాగస్వాములమవుతాం’



వేల్కూరులో వికసిత్ భారత్ కార్యక్రమం, పెద్దకాల్వలో ప్రమాణం చేస్తున్న సర్పంచ్ ఏకాంబరం, అధికారులు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేల్కూరు పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ లలిత, ఎంపీటీసీ రంజని, పెద్దకాల్వ పంచాయతీలో సర్పంచ్ ఏకాంబరం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలుచేస్తున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్రం ఏడాదికి రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. పీఎం కిసాన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములవుతామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఏవో వందన, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర రాజు, పంచాయతీ కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత


మానవ హక్కుల పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

కార్వేటినగరం: మానవ హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయులురెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రాజనీతిశాస్త్ర విభాగాలు సంయుక్తంగా మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకుని నడుచుకోవాలన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎస్.కార్తీక్ మాట్లాడుతూ భూమిపై పుట్టిన ప్రతి మనిషికీ స్వతంత్రంగా జీవించేందుకు హక్కులు ఉంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో సమాజం ఈ హక్కులను హరిస్తుందని, మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ధనుంజయరెడ్డి, అధ్యాపకులు బాలసుబ్రమణ్యం ఆచారి, హరిబాబు, లావణ్య, భార్గవి, విశ్వనాథ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం


ఎంపీటీసీ భర్తను పరామర్శిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: అనారోగ్యంతో బాధపడుతున్న ముడిపల్లి ఎంపీటీసీ సులోచనమ్మ భర్త కృష్ణయ్యను మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యాన్నిచ్చారు. వైద్యం కోసం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేల సాయం చేశారు. అదేవిధంగా అదే గ్రామంలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందిన పార్టీ కార్యకర్త బాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుని భార్యకు రూ.10 వేల అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని సూచించారు. సర్పంచ్ ప్రకాష్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, నాయకులు గోవిందయ్య, రామూర్తి, రాము, పురుషోత్తం, చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన


డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరులో రైతులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి వందన అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అదేవిధంగా నానో ఎరువులు వినియోగించడం ద్వారా రవాణా, కూలీల ఖర్చులు తగ్గుతాయని వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. నానో టెక్నాలజీ ద్వారా రూపొందించిన ఎరువులు, యూరియా, డీఏపీని ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తోందని వివరించారు. అనంతరం డ్రోన్‌తో మందుల పిచికారీ చేయడాన్ని చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రేమతో చూడాలి


ప్రత్యేక ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

శ్రీరంగరాజపురం: ప్రత్యేక ప్రతిభావంతులను ప్రేమతో చూడాలని ఎంఈవో అరుణాచలంరెడ్డి తెలిపారు. ఎస్సార్ పురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సర్పంచ్ కుప్పయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల పట్ల తల్లిదండ్రులు ఆవేదన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారిలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 సబ్రతి, హెచ్‌ఎం శ్రీనివాసులు, సర్పంచ్ హరిరెడ్డి పాల్గొన్నారు.

పాముకాటుతో విద్యార్థి మృతి


మృతి చెందిన జాషువ

శ్రీరంగరాజపురం: మండలంలోని కమ్మకండ్రిగ గ్రామంలో గురువారం రాత్రి పాముకాటుతో విద్యార్థి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు జాషువ(13) పుల్లూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల నుంచి చేరుకున్న జాషువా ఆ రోజు రాత్రి భోజనం అనంతరం ఇంటిలో నిద్రించాడు. ఈ క్రమంలో పాముకాటు వేయడంతో తల్లిదండ్రులు వెంటనే శ్రీరంగరాజపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు


ఉభయదారులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వైఎస్సార్‌సీపీ యువత నాయకుడు వాసుదేవరెడ్డి, జానకి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

మంత్రి రోజాకు సన్మానం


మంత్రికి చిత్రపటాన్ని అదజేస్తున్న బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

నగరి: జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మంత్రి ఆర్కే రోజాను సన్మానించారు. వారు నగరిలోని మంత్రిని కలిశారు. వారు మాట్లాడుతూ నగరిలో తొలిసారి అంతర్ జిల్లాల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షుడు గోపి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, క్రీడాకారులు లక్ష్మీనారాయణ, ఎస్.రక్షణ్, కె.సిద్దిక్ పాల్గొన్నారు.

గర్భిణికి మంత్రి ఆశీర్వాదం


సీమంతం వేడుకల్లో మంత్రి రోజా

నింద్ర: మండల కేంద్రమైన నింద్రకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మేరీ కోడలు లిఖితకు శుక్రవారం సీమంతం చేశారు. ఇందులో మంత్రి రోజా పాల్గొని గర్భిణి లిఖితను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, కోఆప్షన్ సభ్యుడు అనీల్, సర్పంచ్ వసంతమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ విజేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేణు రాజు, నాయకులు సంపత్, మహేష్, వీరయ్య, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


పిల్లలకు బహుమతులందజేస్తున్న ఎంఈవోలు

పుత్తూరు: భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ప్రతిభావంతులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని వడమాలపేట ఎంఈవోలు పద్మావతి, తులసీరామ్ తెలిపారు. వడమాలపేటలోని భవిత కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రత్యేక ప్రతిభావంతులను ప్రతి రోజూ విధిగా భవిత కేంద్రానికి పింపించాలన్నారు. తద్వారా వారిలో మనోధైర్యం పెరుగుతుందని సూచించారు. అనంతరం దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దినకుమార్, ఉపాధ్యాయులు రంగయ్య, హేమలత, విజయకుమారి, కుమారి, సీఆర్‌పీలు నీలకంఠం, స్వాతి, అన్నపూర్ణ, మురళి, సురేఖ, వాసు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఓటరు జాబితా


అధికారులకు సూచనలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

పుత్తూరు: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని ఓటరు జాబితా వెరిఫికేషన్ స్పెషల్ ఆఫీసర్ పి.భాస్కర్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం పుత్తూరు మండలంలోని తడుకు, వేణుగోపాలపురం గ్రామాల్లో పర్యటించి ఓటరు జాబితాను తనిఖీ చేశారు. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు, చేర్పులు, మార్పులు, కొత్త ఓటర్ల నమోదుకు ఈ నెల 9వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు బీఎల్‌ఓలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలోని బ్లర్ అయిన ఫొటోల స్థానంలో కొత్త ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగరి ఆర్డీవో సృజన, పుత్తూరు తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి, మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్

పెనుమూరు(కార్వేటినగరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్ తెలిపారు. మండలంలోని గుత్తావాళ్ల ఊరు పంచాయతీ వడ్డి గుడెసెలు గ్రామంలో శుక్రవారం రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక మారుమూల గ్రామాల్లోను అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పెనుమూరు మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని వివరించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన మంత్రికి సర్పంచ్ అమ్ములు గ్రామంలో సిమెంటు రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారని పేర్కొన్నారు. దీంతో గ్రామానికి సీసీ రోడ్లు మంజూరు చేశారని తెలిపారు. అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా నారాయణస్వామిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు దాము, నాయకులు రాజేష్ వెంకటేశులు, కృష్ణమూర్తి, బక్కయ్య, రాజారెడ్డి పలువురు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

నగరి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర భవిష్యత్ ముడిపడి ఉందని నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. ఆయన శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వీధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి సచివాలయ పరిధిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించే బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వైఎస్‌ఆర్సీపీ నాయకులుతో కలిసి చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలపై చర్చించారు. సచివాలయ పరిధిలో రూ.24.14 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశామని వివరించారు. మంచి పనులు చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని, రోజాను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు ఇంద్రయ్య, గిరిజా కుమారి, బీడీ భాస్కర్, అమర్, మురుగ, కోఆప్షన్ సభ్యుడు ఎల్లప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి మొక్కల పెంపకంతో అధిక ఆదాయం


మామిడి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్

వెదురుకుప్పం: మామిడి మొక్కల పెంపకంతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం పెద్దపోటుచేను గ్రామంలో 2 ఎకరాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సాగు చేస్తున్న మామిడి మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా మామిడి మొక్కల పెంపకానికి నిధులు మంజూరుచేస్తోందని పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి గాను మండలానికి 211 మంది రైతులకు 169 ఎకరాల్లో మామిడి మొక్కలు, 8 ఎకరాల్లో కొబ్బరి మొక్కలు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చినట్టు వివరించారు. మొక్కల సంరక్షణకు మొదటి సంవత్సరానికి రూ.47 వేలు, రెండో ఏడాదికి రూ.27 వేలు, మూడో సంవత్సరానికి రూ.24,890 ఇస్తుందన్నారు. అదేవిధంగా చిన్న, సన్నకారు రైతులను ఉపాధి హామీ కింద నిధులు మంజూరు ఆదుకుంటోందన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు.